
సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 6 । మే । 2023



ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

వైద్యారోగ్య శాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల జీవితాల్లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వెలుగులు నింపింది. - 8లో



సైన్ బోర్డుకు షార్ట్ సర్క్యూట్

స్థానిక ఎత్తుబ్రిడ్జి మీద నున్న మన విజయనగరం సెల్ఫీ సైన్ బోర్డు వద్ద శుక్రవారం కురిసిన భారీ వర్షానికి విద్యుత్ వైర్లు గాలికి చెదిరి షార్ట్ సర్క్యూట్ అయింది. - 8లో



అగ్రిల్యాబ్ సేవలు భేష్

రైతులకు నాణ్యమైన సేవలందించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ సేవలు భేషుగ్గా ఉన్నాయని నాబార్డు డీజీఎం టి.నాగార్జున ప్రకటించారు. - 8లో

న్యూస్‌రీల్

ఖరీఫ్ సాగుకు ఎరువులు సిద్ధం



రాబర్ట్‌పాల్

పార్వతీపురంటౌన్: ఖరీఫ్ సీజనుకు పార్వతీపురం మన్యం జిల్లా రైతులకు అవసరమైన ఎరువులను సిద్ధం చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు యూరియా, డీఏపీ, పొటాష్ తదితర ఎరువులు 45,523 మెట్రిక్ టన్నులు కేటాయించగా ఇప్పటికే 6,615 మెట్రిక్ టన్నులు చేరుకున్నాయన్నారు. ప్రస్తుతం 6,073 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

22 మందికి నియామక పత్రాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ పొంది ఉద్యోగాలు పొందిన 22 మంది అభ్యర్థులకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తన కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను సైతం అందజేశారు. ఉద్యోగాల్లో చేరి వృత్తినైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని, జిల్లాకు మంచి పేరుతీసుకురావాలని ఉద్బోధించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను మెరుగుపరిచి ఉపాధి బాటలు వేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఎమ్మార్‌నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్‌లో ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో 28 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 22 మంది విశాఖలోని అరొన ఇంజినీరింగ్ అండ్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

నేటి నుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీలు



కబడ్డీ, వాలీబాల్ కోర్టులను సిద్ధం చేస్తున్న పీడీలు

వీరఘట్టం: వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో శనివారం నుంచి ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6,7,8 తేదీల్లో పోటీలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. క్రీడాకోర్టులను సిద్ధం చేశారు.

ఇన్‌చార్జి డీఈఓ ప్రేమ్‌కుమార్



ప్రేమ్‌కుమార్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఎఫ్ఏసీ డీఈఓగా ఎస్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. నాడు-నేడు పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాఠశాలల్లో దీర్ఘకాలిక సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

నేడే 'టెన్'షన్‌కు తెర

విజయనగరం పూల్‌బాగ్: పదోతరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల కోసం విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల చేస్తామని విద్యాశాఖ ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా గత మూడో తేదీ నుంచి 18వ తేదీవరకు 127 కేంద్రాల్లో 25,527 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 12,271 మంది బాలురు, 11,828 మంది బాలికలు ఉన్నారు. ప్రైవేటు విద్యార్థులు 1428 మంది కాగా అందులో 975 మంది బాలురు, 453 మంది బాలికలు ఉన్నారు.

సత్తా చూపారు



పతకాలు సాధించిన వసపాం బాలికలు

పూసపాటిరేగ: మండలంలోని వసపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో సత్తా చూపారు. తిరుపతిలో ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు జరిగిన క్రీడల్లో పాఠశాలకు చెందిన జి.లక్ష్మి హైజంపులో కాంస్య పతకం, కె.లక్ష్మి నాలుగు వందల మీటర్ల రిలే పరుగుపందెంలో కాంస్య పతకం సాధించింది. బాలికలను పాఠశాల హెచ్ఎం ఐ. రాజేశ్వరరావు, పీఈటీ లీలాకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

● జలకళ



వారం రోజుల కిందట వేగావతి నది ఇలా..



నదిలో శుక్రవారం నీటి ప్రవాహం ఇలా..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మూడు రోజులుగా కురుస్తున్న మోస్తరు, భారీ వర్షాలకు నదులు జలకళను సంతరించుకున్నాయి. మొన్నటివరకు ఇసుక తిన్నెలతో దర్శనమిచ్చిన నదుల్లో ఇప్పుడు నీరు ప్రవహిస్తోంది. దీనికి వేగావతి నదిలో నీటి ప్రవాహమే నిలువెత్తు నిదర్శనం. వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు, స్నానపానాదులకు నీటి ఇబ్బందులు ఉండవని నదీతీర ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - బొబ్బిలి

● మల్లెల అర్చన

వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని జామిలోని పురాతన త్రిపురాంతకస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెపూలతో అర్చకులు శుక్రవారం అర్చన జరిపారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. కనకదుర్గ మాత ఆలయంలోనూ అమ్మవారికి మల్లెలతో పూజలు చేశారు. - జామి



పచ్చిరొట్టతో సత్తువ రెట్టింపు

- జిల్లాకు 3,370 కింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల కేటాయింపు
- ఎస్సీ, ఎస్టీ రైతులకు 90, ఇతరులకు 50 శాతం రాయితీపై విక్రయం
- రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు



రుద్రిపేటలో పచ్చిరొట్ట సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్:

భూమి సారవంతం (సత్తువతో)గా ఉంటే పంట ఏపుగా పెరుగుతుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తాయి. రైతు కు సాగు కలిసి వస్తుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు భూమిని ముందస్తుగా సారవంతం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఖరీఫ్‌సాగు ప్రణాళికను రూపొందించింది. సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. వ్యవసాయ అధికారులతో పచ్చిరొట్ట సాగుపై ఊరూరా అవగాహన కల్పిస్తోంది. జిల్లాకు 3,370 కింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేసి కావాల్సిన రైతులకు పంపిణీ చేస్తోంది.

పచ్చిరొట్టతో బహుళ ప్రయోజనాలు

ప్రధాన పంటకు 45 రోజులు ముందుగాపచ్చిరొట్ట విత్తనాలు (జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి, ఈడవినీలి వంటివి) పొలంలో విత్తుకోవాలి. 45 రోజుల్లో వేను పూతదశకు వస్తుంది. ఆ సమయంలో దుక్కి/దమ్ము చేయడం ద్వారా పచ్చిరొట్ట భూమిలో కలిసి సారవంతంగా మారుతుంది. భూమి అంతర పొరల్లో గుల్ల ఏర్పడి వానపాముల ప్రత్యుత్పత్తి జరుగుతుంది. ఈ వానపాములు పంటకు మేలు చేకూరుస్తాయి. భూమిలోని స్థూల పోషకాలైన నత్రజని 1.8 నుంచి 3.5 శాతం సమకూరుతుంది. భాస్వరం 0.1 నుంచి 0.3 శాతానికి, పొటాషియం 0.5 నుంచి 2.0 శాతానికి పెరుగుతుంది. పంట ఎదుగుదల, దిగుబడిలో ఈ పోషకాలు కీలంగా సహకరిస్తాయి. రసాయన ఎరువుల వినియోగాన్ని 30 శాతం మేర తగ్గించుకోవచ్చు. పచ్చిరొట్టతో పంట సేద్యానికి అవసరమైన కాల్షియం, నత్రజని, మాంగనీస్, గంధకం, జింకు వంటి సూక్ష్మధాతువులు పుష్కలంగా సమకూరుతాయి. నీటినిల్వలు భూ అంతర్ పొరలకు చేరి పంట ఎదుగుదలకు సహకరిస్తాయి. భూమి ఆరోగ్యవంతంగా మారుతుంది. కలుపు మొక్కలు నాశనమవుతాయి.

పచ్చిరొట్ట రకం, కిలో ధర, నిల్వలు, రాయితీ ఇలా..

రకం	అందుబాటులో ఉన్న విత్తనాలు (క్వింటాళ్లలో)	వాస్తవ ధర (కిలో)	50 శాతం రాయితీపై	90 శాతం రాయితీపై
జీలుగ	1,875	రూ.79	రూ.39.05	రూ.7.9
జనుము	1,375	రూ.84	రూ.42	రూ.8.4
పిల్లిపెసర	120	రూ.97	రూ.60	రూ.9.7

ఆర్బీకేల ద్వారా....

రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రైతులు తమ ఆధార్ కార్డుతో ఆర్బీకేలకు చేరకుని బయోమెట్రిక్ వేసి కావాల్సిన విత్తనాలను ముందుగా నమోదు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతరులు 50 శాతం రాయితీపై 10 కేజీల బ్యాగ్‌ల రూపంలో విత్తనాలను విక్రయిస్తోంది.

“ నాణ్యమైన దిగుబడులు



రైతులు ఏటా వరి వెదలు చల్లడంతో భూసారం తగ్గుతోంది. ప్రతీ రెండేళ్లకు ఓసారి పచ్చిరొట్టను సాగు చేయడం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. రసాయనిక ఎరువుల అవసరం లేకుండానే పంట ఏపుగా పెరుగుతుంది. దిగుబడులు పెరుగుతాయి. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేలను సందర్శించాలి. పచ్చి రొట్ట సాగుకు ఇదే అదును.

–ఎన్ని వాహిని, వ్యవసాయాధికారిణి, పాలకొండ

340 మంది దంపతులకు..
రూ. 2,28,30,000 ఆర్థిక లబ్ధి



వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా నిధుల నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం:

వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా కింద పేద కుటుంబాల నూతన వధూవరులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో జనవరి నుంచి మార్చి త్రైమాసానికి సంబంధించి 340 మంది దంపతులకు రూ.2కోట్ల28లక్షల30వేలను విడుదల చేసినట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించిన నిధుల విడుదల కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులు, లబ్ధిదారులు తిలకించారు. పెళ్లి చేసుకొని నూతన జీవితాన్ని ప్రారంభించిన దంపతులకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించే సామాజిక బాధ్యతను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు 'వైఎస్సార్ కళ్యాణమస్తు' కింద, ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు 'వైఎస్సార్ షాదీ తోఫా' కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. కనీసం పదవతరగతి చదివి, వధువుకు 18 ఏళ్లు, వరునికి 21 ఏళ్లు నిండి వివాహం చేసుకున్న వధూవరులు వివాహమైన 30 రోజులలోపు తమ దగ్గర్లోని గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చన్నారు. దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఫిబ్రవరి, మే, ఆగస్టు, నవంబర్‌లలో ఆయా త్రైమాసికాలకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తుందన్నారు. రాష్ట్రంలోని మహిళలకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో కులాంతర వివాహాలు చేసుకున్న వధువులకు వారి ఖాతాలోను, అదే కులంలో వివాహాలు చేసుకున్న వధువులకు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 340 దంపతులలో వెనుకబడిన తరగతులకు చెందిన అదే కులం వారిని వివాహం చేసుకున్నవారు 234, కులాంతర వివాహం చేసుకున్నవారు 6, కులాంతర వివాహం చేసుకున్న దివ్యాంగులు 8, షెడ్యూల్డు కులాలకు చెంది అదే కులంలో వివాహం చేసుకున్న వారు 45, షెడ్యూల్డు జాతులకు చెంది అదేకులంలో వివాహం చేసుకున్న వారు 33, కులాంతం వివాహం చేసుకున్నవారు 5 మంది దంపతులకు రూ. 2,28,30,000లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ మేరకు నిధుల నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా పార్వతీపురం పట్టణానికి చెందిన లబ్ధిదారులు మేనక కార్తీక్, విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ ప్రైవేటు ఉద్యోగాలుచేస్తూ ప్రేమ వివాహం చేసుకున్నామని, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం కొత్త జీవితాన్ని ఆరంభించిన తమకు ఎంతో ఉపయోగకరమని సంతోషం వ్యక్తం చేశారు. పేద కుటుంబాల యువత వివాహాలకు ప్రభుత్వం కళ్యాణమస్తు, షాదీతోఫా కింద అందిస్తున్న నిధులు తమ కుటుంబాలకు ఆర్థిక అవసరాలు తీర్చుతున్నాయని పార్వతీపురానికి చెందిన వధూవరులు బూసూరు లక్ష్మణ్, రాశి, చినబొండపల్లి గ్రామానికి చెందిన మిర్చి సత్యనారాయణ, కళ్యాణి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కిరణ్‌కుమార్, వెలుగు ఏపీడీ సత్యంనాయుడు, సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ జియాఉద్దీన్, వధూవరులు, వధువుల తల్లులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

- అధికారులకు సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి హెచ్చరిక



గృహనిర్మాణ శాఖ ఈఈని ప్రశ్నిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

పాలకొండ: అధికారులు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి హెచ్చరించారు. పాలకొండ పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం సందర్శించిన ఆమె కొన్నిచోట్ల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా గృహనిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై అసహనం కనబరిచారు. తొలుత ఆమె సీతంపేట రోడ్డులో ఐటీడీఏ తరఫున ఏర్పాటు చేయనున్న పెట్రోలుబంకు కోసం కేటాయించిన స్థలం పరిశీలించారు. అనంతరం జగనన్న అర్బన్ లే-అవుట్‌ను సందర్శించి, వార్డుల వారీగా లబ్ధిదారుల జాబితా, ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. ఎక్కువగా నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో ఏం చేస్తున్నారని గృహ నిర్మాణ శాఖ అధికారులను ప్రశ్నించారు. నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ తర్వాత బుట్టిమఠం కాలనీలో మంజూరైన ఇళ్లు చూసి, అర్హులైన ఇక్కడి వారికి రేషన్ కార్డులు, ఇళ్లు మంజూరు చేయాలని తెలిపారు. ఇక్కడ అర్హులైన వారు ఉన్నా ఎందుకు పథకాలు మంజూరు చేయలేదని సచివాలయ సిబ్బందిని ప్రశ్నించగా, వారి నుంచి సమాధానం రాకపోవడంతో నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును ప్రశ్నించారు. సిబ్బంది తీరు సక్రమంగా ఉండేలా మీరెందుకు పర్యవేక్షణ చేయడం లేదని నిలదీశారు. 1వ వార్డు వలంటీర్‌ను వెంటనే తొలగించి, వారి స్థానంలో వేరే కొత్త వ్యక్తిని నియమించాలని ఆదేశించారు. వారం రోజుల్లో ఇక్కడి సమస్యలు పరిష్కారం కావాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్కడి నుంచి తంపటాపల్లి గ్రామం వెళ్లిన ఆమె అక్కడి పాఠశాల నైట్‌వాచ్‌మెన్‌ల వివాదంపై విచారణ చేశారు. ఆమె వెంట పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ ఉన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ఎందుకంత అక్కసు!

- టీడీపీ నాయకుల తీరు సరికాదు
- భోగాపురం ఎయిర్‌పోర్టుపై అడుగడుగునా విషం చిమ్మడం తగదు
- మీరు తెచ్చిన అనుమతులు ఏమిటో చెప్పండి
- ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం:

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషిచేస్తుంటే టీడీపీ నేతలు ఎందుకు అంత అక్కసు చూపుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. భోగాపురం విమానాశ్రయానికి ఈ నెల మూడో తేదీన ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం, 30 నెలల్లో పూర్తి చేస్తామని జీఎంఆర్ సంస్థ అధినేత గ్రంధి మల్లికార్జునరావు చెప్పడంతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, టీడీపీ నాయకులు ఓర్వలేక విషంచిమ్ముతున్నారన్నారు. జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భోగాపుం అంతర్జాతీయ విమానాశ్రయానికి, జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన కార్యక్రమాలను విజయవంతం చేసిన జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు, అధికార యంత్రాంగానికి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం కావడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల ఆదరణతో మంత్రి పదవులు అనుభవించిన అశోక్‌గజపతిరాజు... ఇప్పుడు ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుంటే ఆహ్వానించకుండా కుళ్లు ప్రదర్శిస్తున్నారన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ వద్దని ముఖ్యమంత్రి ఎక్కడా అనలేదని, భూసేకరణ తగ్గించాలంటూ రైతుల తరఫున ఉద్యమం చేశారన్నారు. భోగాపురం ప్రాంత రైతులకు జగన్‌మోహన్‌రెడ్డి వల్ల కలిగిన మేలు తెలుసన్నారు.

ఉత్తుత్తి శంకుస్థాపనలు

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసినవన్నీ ఉత్తుత్తి శంకుస్థాపనలు అని మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. జీఎంఆర్ సంస్థ అధినేతకు ముఖ్యమంత్రిపై విశ్వాసం ఉందని, అందుకే దివంగ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసి ప్రారంభోత్సవం చేశారని ప్రశంసిస్తూ భోగాపురం ఎయిర్‌పోర్టుకూడా మీరే శంకుస్థాపన చేసి, ప్రారంభోత్సవం చేస్తారని కితాబిచ్చారన్నారు. 30 నెలల్లో ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేస్తామని జీఎంఆర్ సంస్థ అధినేత చెప్పడం గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి విన్నపం మేరకు రెండో రన్‌వే వేస్తామని హామీ ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. భోగాపురం విమానాశ్రయం ద్వారా విజయనగరం జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దీనిపై హర్షించాల్సిన టీడీపీ నాయకులు విమర్శించడం తగదన్నారు. 2024లో కూడా టీడీపీకి ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు



ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ, గ్రంథాలయ సంస్థ సభ్యులు

విజయనగరం అర్బన్: వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు 'వేసవి విజ్ఞాన శిబిరం' పేరుతో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు శిబిరం షెడ్యూల్‌కు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్.లలిత పాల్గొన్నారు.

● ముమ్మర తనిఖీలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్తుపదార్థాల రవాణాపై పోలీస్ యంత్రాంగం నిఘా పెంచింది. వాహనాలను నిశితంగా తనిఖీ చేస్తోంది. అంతర రాష్ట్ర కూడలి రామభద్రపురం బైపాస్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద సీఐ తిరుమలరావు, పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు జరిపారు. మద్యం, మత్తుపదార్థాల రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని సీఐతో పాటు ఎస్ఐ సురేంద్రనాయుడు హెచ్చరించారు. - రామభద్రపురం

క్లుప్తంగా

100 మద్యం బాటిల్స్ పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిల్స్ రవాణా చేస్తున్న వ్యక్తి, పోలీసులు

దీవుపల్లి: మద్యం బాటిల్స్ అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని మండలంలోని రావివలస జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు చెప్పారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు శుక్రవారం తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో రావివలస జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనంపై 100 మద్యం బాటిల్స్ అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మద్యం బాటిల్స్ అక్రమంగా తరలించినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

లారీ బోల్తా



జాతీయ రహదారి బ్రిడ్జి సమీపంలో కర్రల లోడుతో బోల్తాపడిన లారీ

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం బ్రిడ్జి సమీపంలో కర్రలలోడుతో ఉన్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురవడంతో రోడ్డు బురద మయంగా ఉండడం వల్ల విజయనగరం నుంచి రామభద్రపురం వైపు వెళ్తున్న లారీ ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో రాకపోకలు సాగించిన వారెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై గంగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

యువతి ఆత్మహత్యకేసులో తండ్రికి మూడేళ్ల జైలుశిక్ష

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస గ్రామానికి చెందిన యువతి వెంపటాపు భారతి 2017లో ఆత్మహత్యకు పాల్పడిన కేసుకు సంబంధించి ఆమె తండ్రి వెంపటాపు కామినాయుడుకు రాజాం అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టు మూడేళ్లు జైలుశిక్ష విధించినట్లు సంతకవిటి స్టేషన్ ఏఎస్సై వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. 2017 జూలై 11న యువతి తల్లి భాగ్యలత ఫిర్యాదుమేరకు అప్పటి సంతకవిటి ఎస్సై చిరంజీవి కేసు నమోదుచేసి, రాజాం కోర్టుకు అప్పగించారు. ఈ కేసులో పదిమంది నిందితులు ఉండగా, వారంతా నిరపరాధులుగా రాజాం కోర్టు గుర్తించింది. వాదోపవాదాల అనంతరం యువతి తండ్రిని ముద్దాయిగా నిర్ధారించి జడ్జి ఎం.బాబు శిక్ష విధించారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం



రెవెన్యూ అధికారుల సమక్షంలో గంజాయి తూస్తున్న ఎస్సై వెంకటరమణ

పాచిపెంట: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తి నుంచి ఐదుకేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన కుమ హంటల్ గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై ఒడిశానుంచి సాలూరు వైపు గంజాయి తరలిస్తుండగా పి.కోనవలస చెక్‌పోస్టువద్ద పట్టుబడినట్లు చెప్పారు. ఆ వ్యక్తి నుంచి గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారుల సమక్షంలో తూనిక వేసి, పట్టుబడిన వ్యక్తిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

Palakonda Nagar Panchayat

E-Procurement Tender Notice

("15th FC 2020-21, 15th FC 2021-22, GGMP High - Impact works", General fund)

Roc.No. 286/2020-21, 2021-22 /E1/15th FC Revised Estimates, ADP Estimates, GGMP Estimates, 210/2023/E1 /General fund, 211/2023/E1/ General fund Dt: 05-05-2023

Sir,

www.apeprocurement.gov.in

IFB NO / Nit No:		15/2023/E1-PNP/Dt.01-05-2023 to 45/2023/E1-PNP/Dt.01-05-2023
Bid Document Downloading Start Date	:	04/05/2023, 06/05/2023 Time: 10:30 AM
Bid Document Downloading End Date	:	13/05/2023, 19/05/2023 Time: 05:00 PM
Last Date & Time for Receipt of Bids	:	15/05/2023, 19/05/2023 Time: 05.30 PM
Bid Opening Date	:	15/05/2023, 19/05/2023 Time: 05:31 PM
Contact Details		Cell No. 9849944722, 9032439484 palakondanp1@gmail.com palakondanp@gmail.com www.apeprocurement.gov.in

Sd/- Municipal Commissioner
Palakonda Nagar Panchayat

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

- జీతాలు పెంచిన ప్రభుత్వం
- 1,002 మందికి లబ్ధి



ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగికి కట్టు కడుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్య శాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (హెచ్‌హెచ్‌ఎం) విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల జీవితాల్లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వెలుగులు నింపింది. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు జీతాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. వారికి మే నెల జీతంలో పెరిగిన వేతనాలు ఎరియర్‌తో సహా జూన్ ఒకటో తేదీ నుంచి అందనున్నాయి. జిల్లాలో 2007లో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకం ప్రారంభమైంది. ఈ పథకంలో ఏఎన్‌ఎంలు 289 మంది, ల్యాబ్ టెక్నీషియన్‌లు 53 మంది, వైద్యులు 154 మంది, ఫార్మసిస్టులు 27 మంది, స్టాఫ్ నర్సులు 290 మంది, ఇతర క్యాడర్లలో 189 మంది పని చేస్తున్నారు.

23 నుంచి 40 శాతం వేతనం పెరుగుదల

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు 23 నుంచి 40 శాతం వరకు వేతనాలు పెరగనున్నాయి. ఏఎన్‌ఎం, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులకు 40 శాతం జీతాలు పెరగనున్నాయి. అదేవిధంగా వైద్యులు థియేటర్ అసిస్టెంట్స్, ఓటీ టెక్నీషియన్స్, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ తదితర క్యాడర్‌కు 23 శాతం జీతాలు పెరగనున్నాయి. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)కు రూ.15 వేల వరకు ఇన్సెంటివ్స్ ఇవ్వనున్నారు. వారి పనితీరును బట్టి రూ.10 వేలకు తగ్గకుండా ఇన్సెంటివ్ అందుకోనున్నారు.

జూన్ నుంచి పెరిగిన వేతనం

నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు పెంచింది. పెరిగిన జీతం ఎరియర్స్‌తో కలిపి జూన్ నెల నుంచి వస్తుంది. – డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, డీపీఎంఓ, ఎన్‌హెచ్‌ఎం

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్ మృతి

- జరజాపుపేటలో అలుముకున్న విషాదఛాయలు



విద్యుత్ స్తంభంపై అపస్మారక స్థితిలో వేలాడుతున్న శివ

నెల్లిమర్ల రూరల్: కూలి పనులు చేసుకుంటూ ఒక్కగానొక్క కుమారుడిని చదివించి ప్రయోజకుడిని చేసిన ఆ తల్లిదండ్రుల ఆశలు ఎక్కువ రోజులు నిలవలేదు. ఎవరూ ఊహించని రీతిలో విద్యుదాఘాతానికి గురై చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చాడు. ఈ ఘటనపై ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన మద్దిల నారాయణమూర్తి, లక్ష్మి దంపతుల కుమారుడు మద్దిల శివ(26) సచివాలయ జూనియర్ లైన్‌మన్‌గా స్థిరపడ్డాడు. బూరాడపేట గ్రామ సచివాలయం పరిధిలో మూడున్నరేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రామానికి సమీపంలో ఉన్న ఓ పాల డైరీ నిర్వాహకుడు హైఓల్టేజీ వస్తోందని శివకు చెప్పడంతో శుక్రవారం పొలాల్లో ఉన్న విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లాడు. ఎల్‌సీ తీసుకుని విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా రిటర్న్ సప్లై కావడంతో విద్యుత్ స్తంభంపైనే అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న శివను స్థానికులు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు శివకు అక్కతో పాటు తల్లిదండ్రులు ఉన్నారు. అసిస్టెంట్ జూనియర్ లైన్‌మన్ బంగారయ్య నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు.

క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి జరిమానా

- వినియోగదారుల ఫోరం తీర్పు

విజయనగరం లీగల్: ఒక రోగానికి బదులు మరో రోగానికి చికిత్స చేసి ఓ మహిళ మృతికి కారణమయ్యారన్న ఆరోపణ రుజువు కావడంతో విజయనగరం క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి జిల్లా వినియోగదారుల ఫోరం షాకిచ్చింది. చికిత్స కోసం వసూలు చేసిన మొత్తం 1.06.లక్షలతో పాటు మరో రూ.పది లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు ఆర్.వి.నాగసుందర్, సభ్యులు ఆశోక్ శర్మ, బంటుపల్లి శ్రీదేవి సంచలనాత్మక తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలిలోని జెండా వీధికి చెందిన మలిశెట్టి సరోజిని అనారోగ్యానికి గురైంది. ఆమె 2020 డిసెంబర్ 28 న బొబ్బిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆమెను పరిశీలించిన వైద్యులు క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి రిఫర్ చేశారు. వెంటనే ఆమె కుమార్తె సునీత సహాయంతో ఇక్కడ చేరింది. ఆమెకు కోవిడ్ రోగానికి చికిత్స చేశాక పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ సరోజినికి పరీక్షలు నిర్వహించి కోవిడ్ కాదని, కిడ్నీలు పూర్తిగా పాడై పోయాయని ,సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో వెంటనే చేరమని కేజీహెచ్ వైద్యులు సూచించారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. రోగాన్ని సరిగా గుర్తించలేక పోవడం అలాగే రోగానికి తగిన చికిత్స అందించని కారణంగానే తన తల్లి మృతి చెందిందని మృతురాలి కుమార్తె సునీత జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది.సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో కమిషన్ పై విధంగా తీర్పు చెప్పింది. ఫిర్యాదుదారు తరపున బొబ్బిలి న్యాయవాది కె. ప్రసాదరావు వాదించారు.

మన విజయనగరం సైన్ బోర్డుకు షార్ట్ సర్క్యూట్



మన విజయనగరం సెల్ఫీ బోర్డు వద్ద వస్తున్న మంటలు

విజయనగరం క్రైమ్: స్థానిక ఎత్తుబ్రిడ్జి మీద నున్న మన విజయనగరం సెల్ఫీ సైన్ బోర్డు వద్ద శుక్రవారం కురిసిన భారీ వర్షానికి విద్యుత్ వైర్లు గాలికి చెదిరి షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో బోర్డు పక్కన ఉన్న వాటర్ ఫ్లో అయ్యే ఆకృతి అగ్నికి ఆహుతైంది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు స్వీయ పర్యవేక్షణలో ఎస్సైలు లోవరాజు, ఏఎం రాజు ట్రాఫిక్ మళ్లించారు. మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ ఎస్.అప్పారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సుమారు రూ. 2లక్షల వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹ 274

సచివాలయ డీఏ ఆత్మహత్య



సచివాలయ డీఏ మాలి రవి మృతదేహం

భామిని: మండలంలోని సింగిడికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ మాలి రవి(35)పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి పురుగు మందు తాగి అస్వస్థతకు గురైన మాలి రవి(35)ని పాలకొండ ఆస్పత్రి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మృతుని స్వగ్రామం సింగిడిలో శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. బంధువులతో పాటు 16 సచివాలయాల ఉద్యోగులు విషణ్ణ వదనాలతో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మండలంలోని నల్లరాయిగూడ గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా రవి పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ప్రొహిబిషన్ డిక్లరేషన్ సందర్భంగా సహచరులతో ఆనందం పంచుకున్నాడు. ప్రభుత్వం పెంచిన జీతాన్ని అందుకోకుండానే అసువులు బాశాడని కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. కుటుంబకలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై యతిరాజుల అమ్మనరావు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, తల్లిదండ్రులున్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

రాజాం సిటీ: మండల పరిధి గెడ్డవలస గ్రామానికి చెందిన బూరాడ సింహాచలం పురుగు మందు తాగి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అంజేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిఫర్ చేయనున్నామని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఇంత వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

పంజా విసిరిన పులి



పులి పంజాకు గురైన ఆవుదూడ

శృంగవరపుకోట: గతంలో ఎస్.కోట ప్రాంత వాసుల కంటిమీద కునుకు లేకుండా చేసిన బెబ్బులి మళ్లీ వచ్చింది. కిల్తంపాలెం పంచాయతీ భర్తాపురం గ్రామానికి చెందిన కాంగ్రేగుల సూరిబాబు కళ్లంలో ఉన్న ఆవుదూడపై గురువారం రాత్రి పంజా విసిరింది. కొద్ది దూరంగా ఈడ్చుకు పోయి సగం దూడను తినేసింది. పులి పాద ముద్రలను గుర్తించిన రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. డీఆర్‌ఓ రవి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. పులి పాదముద్రలుగా నిర్ధారించారు. మగపులి తిరుగుతున్నట్లు చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇటు ముషిడిపల్లి, పెదఖండేపల్లి, భర్తాపురం గ్రామాల్లోను, అటు కొత్తూరు, మల్లిపూడి గ్రామాల్లో పులి జాడలు కనిపించడంతో పులిసంచారం ఎటుఉందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి పులిని పట్టుకునే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

పాలిసెట్‌కు పక్కా ఏర్పాట్లు

- డీఆర్‌ఓ ఎం.గణపతిరావు

విజయనగరం అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన జరిగే పాలిసెట్ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లపై శుక్రవారం తన చాంబర్లో సమీక్షించారు. వైద్యారోగ్య, ఆర్టీసీ, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం పాలిసెట్–2023 ప్రవేశ పరీక్ష 10వ తేదీన ఉదయం 11 నుంచి 1గంట వరకు 30 కేంద్రాల్లో జరుగుతుందని డీఆర్‌ఓ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9,347 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని వెల్లడించారు.

అకౌంట్‌లో నగదు మాయంపై కేసు నమోదు

రాజాం సిటీ: తరచూ ఏటీఎంల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు నగదు తీయడం రాని వ్యక్తులకు సాయం చేసే ముసుగులో నగదు తస్కరిస్తుండడం పరిపాటిగా మారింది. తాజాగా ఓ వ్యక్తి తన ఏటీఎంను వినియోగించి అకౌంట్‌లో నగదు మాయం చేశారని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ కె.రవికుమార్ వెల్లడించారు. సంతకవిటి మండలం తాలాడ గ్రామానికి చెందిన ముగ్గు అప్పలనాయుడు చెరకు పంట విక్రయించగా వచ్చిన మొత్తాన్ని తన కుమారుడు అకౌంట్‌లో జమ చేయించాడు. తనకు డబ్బులు అవసరం ఉండి కుమారుడి ఏటీఎం కార్డు తీసుకుని గత నెల 28న రాజాంలోని ఎస్‌బీఐ ఏటీఎంకు వచ్చాడు. అందులోనుంచి నగదు తీయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తికి కార్డు ఇచ్చి రూ. 20వేలు విత్‌డ్రా చేయాలని కోరాడు. దీనికి అంగీకరించిన ఆ వ్యక్తి తొలుత రూ. 8వేలు, తరువాత రూ.2వేలు తీశాడు. అదేంటి ఒకేసారి రూ. 20వేలు వస్తాయికదా ఎందుకు అలా పలుమార్లు తీస్తున్నావని అడగడంతో మరో రూ. 10వేలు తీసి ఇచ్చాడు. వెంటనే ఏటీఎం బయట ఉన్న మరో వ్యక్తి వచ్చి ఆ వ్యక్తి వద్ద ఉన్న ఏటీఎం తీసుకుని మీకు ఎంతకావాలో చెబితే అంత తీస్తానని చెప్పగా తనకు మరి అవసరంలేదని కార్డు తీసుకుని వెళ్లిపోయాడు. మళ్లీ నగదు అవసరం ఉండి శుక్రవారం రాజాం వచ్చిన ఆయన ఏటీఎంకు చేరుకున్నాడు. ఏటీఎం పిన్ తప్పుగా చూపడంతో కుమారుడికి ఫోన్‌చేసి తెలియజేశాడు. గత నెల 29 నుంచి తన ఏటీఎం వాడుకలో ఉందని, నగదు కూడా విత్‌డ్రా అవుతున్నట్లు మెసేజ్‌లు వస్తున్నాయని కుమారుడు తెలిపాడు. దీంతో తన వద్ద ఉన్న ఏటీఎంను పరిశీలించగా తనపేరు కాకుండా మంజుల ఎ అనే పేరు ఉండడాన్ని గమనించి బ్యాంకును సంప్రదించాడు. గత నెల 28 నుంచి దఫదఫాలుగా రూ. 62,500లు విత్‌డ్రా అయినట్లు వెల్లడించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెల 28వ ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసిన సమయంలో ఉన్న ఇద్దరిలో ఒకరు తన ఏటీఎం కార్డు మార్చి నగదు విత్‌డ్రా చేసి ఉంటారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అగ్రిల్యాబ్ సేవలు భేష్

- నాబార్డ్ డీడీఎం నాగార్జున

నెల్లిమర్ల: రైతులకు నాణ్యమైన సేవలందించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ సేవలు భేషుగ్గా ఉన్నాయని నాబార్డు డీజీఎం టి.నాగార్జున ప్రశంసించారు. నెల్లిమర్లలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ను వ్యవసాయశాఖ జిల్లా అధికారి వి.టి.రామారావు, డీసీసీబీ డీజీఎం కేవీవీ సత్యనారాయణతో కలిసి శుక్రవారం సందర్శించారు. ల్యాబ్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ఏడీలు ఎం.పూర్ణిమ, వి.శ్రీలక్ష్మి ఆయనకు వివరించారు. ల్యాబ్‌లో చేపడుతున్న పరీక్షలను ప్రయోగాత్మకంగా డీడీఎంకు చూపించారు. పరీక్షల వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రభుత్వం రైతులకు సరఫరా చేసే విత్తనాలు, ఎరువులను పరీక్షిస్తామని తెలిపారు. పరీక్షల కోసం రైతులే నేరుగా విత్తనాలు, ఎరువులను ల్యాబ్‌కు తీసుకురావచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రి ల్యాబ్‌లను ఏర్పాటుచేసి, రైతులకు మేలు చేసేలా విత్తన, ఎరువుల నాణ్యత పరీక్షలను నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. ల్యాబ్‌ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులంతా వినియోగించుకోవాలని సూచించారు.

నిబంధనలు మీరితే చర్యలు

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ నిబంధనల మేరకు అబార్షన్లు చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అబార్షన్ల కోసం నంచి వైద్యులను ఆశ్రయించవద్దన్నారు. పసరు మందులు, నాటు వైద్యంతో అబార్షన్లకు ప్రయత్నిస్తే ప్రాణాలకే ముప్పు అని హెచ్చరించారు. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. బిడ్డ ఎదుగుల లేనప్పుడు, తల్లిలేదా బిడ్డకు ప్రమాదం అనుకున్నప్పుడు మాత్రమే అబార్షన్ చేయాలన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి చక్రస్నానం



స్వామికి చక్రస్నానం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. సీతారామస్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో పూర్ణాహుతి జరిపించారు. అనంతరం స్వామికి సముద్ర నదీజలాలతో చక్రస్నానం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన గాయిత్రి, సాయి



ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా జట్టు

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతి వేదికగా జరుగుతున్న పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పురుషుల ఫుట్‌బాల్ జట్టు 3–1 గోల్స్ తేడాతో ప్రథమ స్థానం దక్కించుకుంది. అదేవిధంగా వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో 87 కేజీల మహిళల విభాగంలో ఆర్.గాయత్రి బంగారు పతకం దక్కించుకోగా, పురుషుల 89 కేజీల విభాగంలో బి.సాయి మరో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పిన క్రీడాకారులను సెట్విజ్ సీఈఓ రామగోపాల్, ఆయా క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

బొబ్బిలి: ఈనెల 26 నుంచి మూడురోజుల పాటు కడప జిల్లా కేంద్రంలో జరిగే పదో జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు జిల్లా నుంచి పాల్గొనే బాలుర, బాలికల జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. బొబ్బిలి మండలంలోని పారాది జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొబ్బిలి,తెర్లాం, బాడంగి, గరుగుబిల్లి, రామభద్రపురం మండలాల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి బి విజయకుమార్, పీడీ టి.సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకట నాయుడు, సీహెచ్ సత్యనారాయణ, వి.అప్పలనాయుడు, జి.బంగారి నాయుడు, బి శ్రీనివాసరావులు ఎంపిక చేపట్టారు.

ఎంపీని కలిసిన శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్



ఎంపీ విజయసాయిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష తదితరులు

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డిని ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష శ్రీధర్ పట్నాయక్ శుక్రవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు వీలుగా కేంద్రస్థాయిలో సహకారం అందించాలని ఎంపీ విజయసాయిరెడ్డిని కోరారు. శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర బీసీ కమిషన్, కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్లు ఆమె తెలిపారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు వీలుగా బిల్లుకు తుదిరూపం వచ్చేలా కృషి చేస్తానని ఆమెకు ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎస్ఎన్‌కే మహంతి, పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు	
హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్	
విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	62,180–00
బంగారం(22క్యా. 10గ్రా.)	57,000–00
వెండి (కిలో)	82,800–00

సాక్షి క్లాసిఫైడ్స్

బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారా? అయితే ఈ అవకాశం మీ కోసమే అమరావతి ఫిన్ సురక్ష నిధి - (క్యాష్ బ్యాంకింగ్) - విజయనగరం బ్రాంచ్‌లో పనిచేయుటకు ఉద్యోగులు కావలెను ఇంటర్మీడియట్ పాస్, వయసు : 25 సం॥ల నుంచి 30 సం॥ల వరకు 07-05-2023 (ఆదివారం)న జరిగే వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకాగలరు అమరావతి ఫిన్ సురక్షనిధి లిమిటెడ్ ఫస్ట్ ఫ్లోర్, ఫ్లై ఓవర్, ఉదయిని లింక్ ఎస్ దగ్గర, విజయనగరం. 93929 15966

FLAT FOR SALE

■ Deluxe 2 B/R, Car Park, Loan Can be Arranged 100% Vastu @ R&B Guest House Road, Alakanandha Colony, VZM. Ph : 63035 11633, 92466 24248 [V-776931]

PLOT FOR SALE

■ S.KOTA మునసబుగారి వీధిలో SRI SAI LAKSHMI NAGAR, DTCP LAYOUT (MONDI STREET) లో Plot No.s 27, 28 అమ్మకమునకు కలవు. సెల్: 9000846167, 9440976566 [S-1195855]

■ VZM : YSRనగర్లో ఉడా L.P.నెం.15/22 ప్లాట్లు వెంటనే ఇల్లు కట్టుకునేందుకు అనువైన స్థలం 40 B.T. రోడ్స్, వాస్తు E & N/F ప్లాట్ రేట్లు బ్యాంక్ లోన్స్‌తో కలవు. ఫోన్: 99855 43478 [V-329]

SITE FOR SALE

■ భోగాపురం, విశాఖపట్నం, విజయనగరంలో VUDA Approved స్థలములు అమ్మకమునకు కలవు. Cont: 9182660474 [S-1176693]

WANTED

■ విశాఖపట్నంలో ప్రముఖ ఓల్డేజ్ హోమ్‌కి వృద్ధులకు సేవ చేయుటకు 24 గంటలు ఆడ/మగ & వంట మనిషి (స్త్రీ) కావలెను. ఉచిత భోజనం & వసతి ఇవ్వబడును. ఫోన్: 89899 93756 [V-772]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్రదించండి: 9346032628 [G-786216]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786223]

■ ప్రాంచ్‌లో పర్మినెంట్‌గా (Office work) ఖాళీలు : 210 Q: 10th-డిగ్రీ, కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, క్యాషియర్స్, PO's జీ॥ 24000/- Ph:7816010774 [H-781419]

■ VIP's ఇంట్లో పేషెంట్ చూసుకోవడానికి స్త్రీలు/పురుషుల అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ. Hyd. Ph: 7995984445 [HA-114]

■ హరేకృష్ణ హోమ్స్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K-18K. విజయవాడ ఫోన్ : 9640528899 / 9640648899 [HA-99]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-10756]

■ హైదరాబాద్, హోటల్లో క్లీనింగ్/సర్వీస్/కిచెన్‌లో చేయుటకు బాదరబందీలేని 25-40 సం.లోపు ఆడ & మగ వారు కావలెను. జీ: 12 వేలు+భోజనం+వసతి. సంప్ర: 7702348888 [HA-13750]

■ DHL International Cargo Courier Servicesలో వర్క్ చేయుటకు క్యాబిన్ క్రూ లోడింగ్ full సర్వీసెస్, Office Admin Supervisors, Ground Staff, Team Leaders కావలెను. Q: 10th to any Degree , డిప్లొమా ITI, Age: 18 to 35, Food + Room free. Salary 25,000/- to 32,000/- Ph: 81255 60645 [B-1165888]

■ ప్రముఖ సెక్యూరిటీ కంపెనీకి విజయనగరం జిల్లాలో పనిచేయుటకు 30 మంది గార్డ్సు అర్జంటుగా కావలెను. మంచి వేతనం, EPF & ESI కలదు. ఫోన్ : 98425 55549, 95059 59039 [V-1572]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.